# సీఎం రేవంత్ రెడ్డి హుందాగా వ్యవహరించాలి

- ఆరు గ్యారెంటీలతో పాటు 420 హామీలను అమలు చేయాలి
- పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి
- 5న నియోజక వర్గ స్థాయి బీఆర్ఎస్ ముఖ్యకార్తల సమావేశం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి

పెద్దపల్లి, ఫిబ్రవరి3: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హుందాగా వ్యవహరించాలని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. రేవంత్‌రెడ్డి తన స్థాయిని మరిచి పోయి ఇతరులను కించపరిచేలా మాట్లాడడం శోచనీయమని అన్నారు. పెద్దపల్లిలోని తన కార్యాలయంలో మనోహర్ రెడ్డి శనివారం మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలతో పాటు 420 హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. 100 రోజు ల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని, లేని పక్షంలో ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండగడుతామని హెచ్చరించారు. పెద్దపల్లి నియోజక వర్గంలో బీఆర్ఎస్ హయాంలో మంజూరైన అభివృద్ధి పనులను, తామే చేయించామని కాంగ్రెస్ నాయకులు చెప్పుకోవటం సిగ్గు చేటని విమర్శించారు.

**బీఆర్ఎస్ శ్రేణులపై దాడులు ఆపాలి**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు నుంచే నియోజక వర్గంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై కాం గ్రెస్ నాయకులు దాడులు చేస్తున్నారని అన్నారు. దాడులను ఆపడానికి కాంగ్రెస్ నాయకత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**5న సన్నాహక సమావేశం**

పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఈ నెల 5న మధ్యాహ్నం రెండు గంటలకు రాఘువాపూర్ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో పెద్దపల్లి నియోజక వర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యేగా గెలిచిన తొలి రోజే నియోజకవర్గంలో ఇసుక, మట్టి అక్రమ తరలింపును బంద్ చేస్తానని చెప్పిన చింతకుంట విజయరమణారావు 55 రోజులుగా ఎందుకు నిలిపివేయడం లేదని ఓదెల జడ్పీటీసీ గంట రాములు ప్రశ్నించారు. నియోజక వర్గంలోని చివరి ఆయకట్టు మండలాలైన కాల్వ శ్రీరాంపూర్, ఓదెల రైతులు యాసంగి పంటకు సాగునీరందక ఇప్పుడే ఇబ్బంది పడుతున్నారన్నారు. గడిచిన పదేండ్లలో ఇలాంటి పరిస్థితులు లేవని రైతులు చెబుతున్నారని చెప్పారు. కరెంట్ కష్టాలు కూడా మొదలయ్యాయని, రోజుకు 4 –5 గంటల కరెంట్ కోత పెడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎంపీపీలు బండారి స్రవంతి శ్రీనివాస్, నూనేటి సంపత్, రేణుకాదేవి, రమాదేవి, నాయకులు ఉప్పు రాజ్‌కుమార్, మార్కు లక్ష్మణ్, రామారావు, వెంకట్‌రెడ్డి, రాజ్‌కుమార్, వాసు పాల్గొన్నారు.

## మూడు రేషన్ దుకాణాలు సీజ్

కోల్‌సిటీ,ఫిబ్రవరి 3: రామగుండం నగర పాలక సంస్థ పరిధిలో హైదరాబాద్‌కు చెందిన విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల బృందం శనివారం విస్తృతంగా దాడులు చేపట్టింది. గోదావరిఖనిలోని పలు రేషన్ దుకాణాలను హైదరాబాద్ నుంచి వచ్చిన ఐదుగురు అధికారుల బృందం రామగుండం సివిల్ సప్లయ్ విభాగం అధికారులతో కలిసి ఏకకాలంలో దాడులు చేపట్టారు. ఈ దాడుల సమయంలో రేషన్ దుకాణాల డీలర్లు సమాచారం తెలుసుకొని ముందస్తుగానే దుకాణాలు మూసివేసి వెళ్లిపోయినట్లు తెలిసింది. గోదావరిఖని జవహర్‌నగర్‌లో గల ఓ రేషన్ దుకాణాన్ని తనిఖీ చేయడానికి అధికారుల బృందం రాగా, అప్పటి వరకు బియ్యం పంపిణీ చేసిన డీలర్ మూసివేసి వెళ్లిపోయారు. దీనితో అధికారులు సదరు డీలర్‌ను సంప్రదించే ప్రయత్నం చేయగా, ఎంతకీ అందుబాటులోకి రాకపోవడంతో ఆ షాపును తాత్కాలికంగా సీజ్ చేసినట్లు రామగుండం డిప్యూటీ తహసీల్దార్ తెలిపారు. అదేవిధంగా గోదావరిఖనిలో మొత్తం మూడు రేషన్ దుకాణాలను సీజ్ చేశారనీ, సదరు దుకాణాలపై పూర్తి స్థాయి విచారణ అనంతరం అన్ని సక్రమంగా ఉన్నట్లు నిర్ధారణ అయితే డీలర్లకు అప్పగిస్తామని తెలిపారు.

# కదంబాపూర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్‌రూరల్, ఫిబ్రవరి 3: అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తున్న కదంబాపూర్ గ్రామాన్ని ఇతర గ్రామాలు ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. కదంబాపూర్‌లో నూతనంగా నిర్మినంచిన మహిళా సంఘ భవనం, కమ్యూనిటీ హాళ్లు, అంబేద్కర్ ఆడిటోరియం, షాదిఖానాతో పాటు పలు భవనాలను ప్రారంభించారు. ఎమ్మెల్యేను తాజా మాజీ సర్పంచ్ కోడెం సురేఖ–అజయ్‌లతో పాటు వివిధ సంఘాల నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, నాయకులు ప్రకాశ్‌రావు, రాంరెడ్డి, దామోదర్‌రావు, శ్రీనివాస్, సతీశ్,

**అర్చకులు, పురోహితుల సంక్షేమానికి కృషి**

పెద్దపల్లి టౌన్, ఫిబ్రవరి 3: నియోజకవర్గంలోని విశ్వబ్రాహ్మణ అర్చక, పురోహితుల సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. పట్టణంలోని సిరి ఫంక్షన్ హాలులో విశ్వబ్రాహ్మణ అర్చక, పురోహితుల సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సన్మానించారు. ఇక్కడ సంఘం అధ్యక్షుడు కందుకూరి ఈశ్వరాచార్యులు, ప్రధాన కార్యదర్శి కోటగిరి వేణు మాధవాచార్యులు, నాయకులు నాగులమల్యాల వీరాచారి, సత్యనారాయణచార్యులు, ప్రకాశ్ రావు పాల్గొన్నారు.



సుల్తానాబాద్ రూరల్ : శిలాఫలాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

## మేడారం జాతరకు ప్రత్యేక బస్సులు



జ్యోతినగర్(రామగుండం) : విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే

ఫర్టిలైజర్‌సిటీ, ఫిబ్రవరి 3: వన దేవతల దర్శనం కోసం మేడారం వెళ్లే భక్తులకు ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. గోదావరిఖని ఆర్టీసీ బస్టాండ్‌ను శనివారం సందర్శించారు. జాతర కు వెళ్లే భక్తుల కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక బస్ షెల్టర్‌ను పరిశీలించారు. జాతరకు ప్రత్యేకంగా 120 ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే స్థానికంగా ఉన్న గోలివాడ సమ్మక్క–సారలమ్మ జాతరకు 12 బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. ఇక్కడ ఆర్టీసీ డిపో మేనేజర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

**ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే**

జ్యోతినగర్(రామగుండం), ఫిబ్రవరి 3: రామగుండంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాగూర్ శనివారం సందర్శించారు. విద్యార్థుల తో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. బాల్యంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న ఎమ్మెల్యే అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పాఠశాలకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు నూతన భవనాన్ని నిర్మించి ఆదర్శవంతమైన పాఠశాలగా తీర్చిదిద్ద నున్నట్లు తెలిపారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జెన్‌కో విద్యుత్ కర్మాగారం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

## సదాశయ ఫౌండేషన్ అధ్యక్షురాలిగా అన్నపూర్ణ

కోల్‌సిటీ, ఫిబ్రవరి 3: సదాశయ ఫౌండేషన్ గోదావరిఖని పట్టణ కార్యవర్గాన్ని ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి శనివారం ప్రకటించారు. అధ్యక్షురాలిగా యోగా శిక్షకురాలు అన్నపూర్ణ, ప్రధాన కార్యదర్శిగా బొల్ల చంద్రశేఖర్, గౌరవ అధ్యక్షురాలిగా జ్యోతి, సంయుక్త కార్యదర్శిగా టీ రాములు, ఉపాధ్యక్షులుగా ఏఎస్ఐ శారద, శశికళను ఎన్నుకున్నారు. సభ్యులు చంద్రమౌళి, రాజమౌళి, కేఎస్ వాసు, నారాయణ సుందర్, దూడెం వాణి ఉన్నారు.

## కార్యకర్తలకు అండగా ఉంటా

ధర్మారం, ఫిబ్రవరి 3 : అసెంబ్లీ ఎన్నికల్లో తన గెలుపునకు కృషి చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటానని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ భరోసా ఇచ్చారు. మండల కేంద్రంలోని గౌతమ బుద్ధ ఫంక్షన్ హాలులో కాంగ్రెస్ కార్యకర్తలు, ముఖ్య నాయకులతో లక్ష్మణ్ కుమార్ శనివారం సమావేశమయ్యారు. తనకు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలకు, పార్టీ శ్రేణులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్ష పదవికి పలువురికి పేర్లు ప్రతిపాదించగా, త్వరలోనే అందరికి ఆమోదయోగ్యమైన పేరును ఖరారు చేస్తామని పేర్కొన్నారు.

## శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

జూలపల్లి, ఫిబ్రవరి 3 : కుట్టు శిక్షణను మహిళా కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి సూచించారు. ఈజీఎస్‌లో వంద రోజుల పని దినాలు పూర్తి చేసిన మహిళలకు డీఆర్డీవో, ఎస్‌బీఐ సంయుక్తంగా 'ఉన్నతి' ద్వారా ప్రత్యేక శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో శనివారం 27 మంది మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఎంపీడీవో వేణుగోపాల్‌రావు, ఎంపీవో కిరణ్, ఏపీవో సదానందం, కార్యదర్శులు మద్దెల సతీశ్, తాళ్ల కిరణ్, సంధ్యారాణి పాల్గొన్నారు.

## మతిస్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్య

ఫర్టిలైజర్‌సిటీ, ఫిబ్రవరి 3: పట్టణంలోని చంద్రశేఖర్ నగర్ కు చెందిన మతిస్థిమితం లేని శ్రీపతి నరేశ్(37) శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. గోదావరిఖని వన్‌టౌన్ ఎస్ఐ బీ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం స్థానిక సింగరేణిలో ప్రైవేట్ లేబర్ పనిచేస్తున్న నరేశ్ రెండేళ్లుగా మానసిక వ్యాధితో హైదరాబాద్‌లో చికిత్స తీసుకుంటున్నాడు. కొన్ని రోజులుగా తాను చనిపోతాను అని చెబుతూ వచ్చాడు. ఇంట్లో ఎవరు లేని సమయంలో చీరతో ఇంటి రేకుల షెడ్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి శ్రీపతి మల్లయ్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేపట్టారు. ఇతనికి భార్య జ్యోత్స్న, కొడుకు, కూతురు ఉంది.

## రాములోరికి గోటితో తలంబ్రాలు



గోటితో తలంబ్రాలు ఒలుస్తున్న మహిళలు

కోల్‌సిటీ, ఫిబ్రవరి 3 : శ్రీ సీతారాముల కల్యాణంలో తలంబ్రాలకు ప్రత్యేక స్థానం ఉంది. భద్రాద్రి నుంచి వచ్చిన వడ్లను శనివారం గోదావరిఖనిలోని శ్రీ కోదండ రామాలయంలో రామ భక్తులు గోటితో వొలిచి తలంబ్రాలుగా తయారు చేశారు. ముందుగా స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారి గోవర్ధనగిరి మధుసూదనా చార్యులు, టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ సభ్యులు కుందారపు సదానందం, శ్రీ రాజరాజేశ్వర సేవా సమితి సభ్యులు పద్మ సంధ్య, ఆడెపు ప్రమీల, అనసూయ, శారద, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీ రాముడిని ధ్యానిస్తూ వడ్లను గోటితో వొలిచారు.

## ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి నిలిచిన ఎత్తిపోతలు



రెండో మోటర్ డెలివరీ సిస్టర్న్ ద్వారా వస్తున్న జలాలు

ధర్మారం,ఫిబ్రవరి3: ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి నంది మేడారం గ్రామంలోని నంది రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలు ఎత్తిపోతలను అధికారులు శనివారం నిలిపివేశారు. ఈ రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి మట్టం 230.1 మీటర్లు. ఈ రిజర్వాయర్ నుంచి నీటిని సరఫరా చేయడంతో 226.1 మీటర్ల స్థాయికి నీటి మట్టం పడిపోయింది. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు నీటి పారుదల శాఖ అధికారులు శుక్రవారం సాయంత్రం 4:20 గంటలకు లింక్ –2 ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి అండర్ టన్నెల్ ద్వారా కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు అనుబంధంగా నిర్మించిన నంది పంప్‌హౌస్‌లోని రెండో మోటార్‌ను ఆన్‌చేసి రిజర్వాయర్‌లోకి 3,150 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోశారు.27 గంటల పాటు మోటార్‌ను నడిపారు. రిజర్వా యర్‌లో కనీస నీటి మట్ట 230.1 మీటర్లకు చేరడంతో శనివారం రాత్రి 7:30 గంటలకు నిలిపి వేసినట్లు ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.

## ప్రభుత్వ దవాఖాన తనిఖీ

సుల్తానాబాద్, ఫిబ్రవరి 3: సుల్తానాబాద్ ప్రభుత్వ దవాఖానను మున్సిఫ్ కోర్టు జడ్జి జీఎస్ఎల్ ప్రియాంక శనివారం తనిఖీ చేశారు. రోగుల వివరాలు, వైద్యుల డ్యూటీ పట్టికను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాలపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

## సుల్తానాబాద్ చైర్‌పర్సన్‌పై నెగ్గిన అవిశ్వాసం

సుల్తానాబాద్, ఫిబ్రవరి 3 : సుల్తానాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీతారమేశ్ గౌడ్‌పై శనివారం ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. ప్రిసైడింగ్ అధికారి, పెద్దపల్లి ఆర్డీవో మధుమోహన్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన 12 మంది అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తారు. నివేదికను కలెక్టర్‌కు అందజేసిన తర్వాత తిరిగి నూతన చైర్‌పర్సన్‌ను ఎన్నుకునేందుకు తదుపరి ప్రక్రియను ప్రకటించనున్నట్లు వివరించారు. 13వ వార్డు కౌన్సిలర్ సిద్ధ కనుకయ్య అనారోగ్యంతో మృతి చెందగా, ఐదో వార్డు కౌన్సిలర్ పారుపెల్లి జ్ఞానేశ్వరిగుణపతి అమెరికా పర్యటనలో ఉన్నందున హాజరుకాలేదు. 15 వార్డు కౌన్సిలర్, చైర్‌పర్సన్ ముత్యం సునీతా రమేశ్ కూడా సమావేశానికి రాలేదు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్సైలు విజేందర్, అశోక్‌రెడ్డి, వినీత, కళాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, మేనేజర్ అలీమొద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 3: బసంత్‌నగర్ ఎస్ఐ సులువ వెంకటేశ్ శనివారం అప్పన్నపేటలో సైబర్ నేరాలు, ఇతర నేరాలపై గ్రాస్తులు, యువకులకు అవగాహన కల్పించారు. నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సంప్రదించాల్సిన అధికారులు, కార్యాలయాల గురించి వివరించారు.

## ఇసుక, మట్టి అక్రమంగా తరలిస్తే చర్యలు

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 3: ప్రభుత్వ అనుమతి లేకుండా మట్టి, ఇసుక అక్రమంగా తరలిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని తహసీల్దార్ జాహెద్ పాషా హెచ్చరించారు. స్థానిక తహసీల్ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. వాల్టా చట్టం ప్రకారం ప్రభుత్వ భూముల నుంచి మట్టి, మానేరు వాగు, హుస్సేన్‌మియా వాగుల నుంచి తరలింపునకు ప్రభుత్వ అనుమతి తప్పనిసరి అని స్పష్టం చేశారు.

## పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్

ఫర్టిలైజర్‌సిటీ, ఫిబ్రవరి 3: పట్టణంలోని కృష్ణవేణి విద్యాసంస్థల్లో శనివారం ఫుడ్ ఫెస్టివల్ డే, ఆర్ట్, క్రాఫ్ట్ కార్యక్రమం న్విహించారు. ఆహార పదార్థాల లాభాలు, నిల్వ ఉంచిన పదార్థాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ద్వారా విద్యార్థులు వారి నైపుణ్యతను చాటుకున్నారు. మంజుల శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

## మాజీ సర్పంచ్ దంపతులకు సన్మానం

ఎలిగేడు, ఫిబ్రవరి 3: మండలంలోని నర్సాపూర్ మాజీ సర్పంచ్ దంపతులు తంగెళ్ల స్వప్న–కుమార్‌యాదవ్‌ను జీపీ ఆవరణలో గ్రామస్తులు శనివారం సన్మానించారు. తన పదవీ కాలంలో గ్రామాభివృద్ధి విషయంలో వెన్నంటి ఉండి సహకరించిన పంచాయతీ పాలకవర్గానికి, ప్రజలకు స్వప్న కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తంగెళ్ల శ్రీనివాస్, తిరుపతి, సతీశ్, అమ్ముల శ్రీనివాస్, చింతిరెడ్డి రాజిరెడ్డి, మల్లారెడ్డి, కాట నారాయణగౌడ్, సంతోష్, మధూకర్, లస్మయ్య, సతీష్, రాజమల్లు, సదానందం,, రవీందర్, నాగభూషణం పాల్గొన్నారు.

**పంచాయతీ పాలకవర్గాలకు వీడ్కోలు**

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి3: పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం పూర్తవడంతో మండలంలోని పలు జీపీల్లో శనివారం ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. పెద్దరాత్‌పల్లి లో మాజీ సర్పంచ్ ఓరుగంటి కొమురయ్యగౌడ్‌ను గ్రామస్తులు సన్మానించారు. తనకు పదవి లేకున్నా గ్రామాభివృద్ధికి ముందుండి పని చేస్తానని చెప్పారు. పాలకవర్గ సభ్యులు, సిబ్బందిని ఆయన సన్మానించారు. డాక్టర్ సురేశ్, సునీత, కార్యదర్శి చంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ సీపతి మొగిలయ్య, మాజీ సభ్యులు ఉన్నారు.

## ఆవిర్భా వ వేడుకలు

రామగిరి, ఫిబ్రవరి 3: భవన నిర్మాణ కార్మికుల సమాఖ్య ఆవిర్భావ వేడుకలను జిల్లా అధ్యక్షుడు చిలువేరు స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా కార్యవర్గంతో కలిసి కేక్ కట్ చేసి కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి కార్మికుడు సంఘం బలోపేతానికి సహకరించాలన్నారు.. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు తిరునహరి రాజు, జనరల్ సెక్రెటరీ బైరి శంకర్, కోశాధికారి షరీఫ్, సెక్రెటరీ లక్ష్మీనారాయణ,మల్లేశం, సుధాకర్, శంకర్, శ్రీను, మిట్టపల్లి సతీశ్, మల్లేశ్ పాల్గొన్నారు.

# సాంకేతికతను వినియోగించుకోవాలి

**ప్రిన్సిపల్ జిల్లా జడ్జి, లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ డీ హేమంత్ కుమార్**



పెద్దపల్లి : మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జిల్లా జడ్జి డీ హేమంత్ కుమార్

పెద్దపల్లి, ఫిబ్రవరి3: సాంకేతికతను మంచి ప్రయోజనాలకు వినియోగించుకోవాలని ప్రిన్సిపల్ జిల్లా జడ్జి, లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ డీ హేమంత్ కుమార్ సూచించారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పెద్దపల్లిలోని మినీ ట్యాంక్ బండ్ (ఎల్లమ్మ చెరువు)పై మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ దాసరి మమతారెడ్డి అధ్యక్షతన శనివారం నిర్వహించిన క్యాన్సర్ అవగాహన కార్యక్రమానికి డీసీపీ డాక్టర్ చేతన, ప్రిన్సిపల్ జిల్లా జడ్జి హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడారు. క్యాన్సర్ సమాజంలో వేగంగా విస్తరిస్తున్నదన్నారు. వ్యాధి నియంత్రణకు పాటించాల్సిన నియమాలు, జీవన శైలిలో రావాల్సిన మార్పులు, తదితర అంశాలపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. నేషనల్ డిజిటల్ లైబ్రరీని ఐఐటీ విద్యార్థులు రూపొందించారని ఇందులో రెండు కోట్ల వరకు పుస్తకాలు ఆన్‌లైన్ ఉచితంగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మిషనర్ ఆకుల వెంకటేశ్, అసంక్రమిత వ్యాధుల నివారణ ప్రాజెక్ట్ ఆఫీసర్ పీ మధూకర్ రెడ్డి, శ్రీనివాస్,శంకర్, సంకీర్తన, పెద్దపల్లి సీఐ కృష్ణ, ఎస్ఐ మల్లేశ్, నుచ్చు శ్రీనివాస్, శ్రీపతి సత్తయ్య, సంతోష్, తాని నరేశ్, శరత్ పాల్గొన్నారు.

**జీడీకే-11వ గనిపై అవగాహన**

గోదావరిఖని, ఫిబ్రవరి 3: సింగరేణి వైద్యారోగ్య శాఖ డిప్యూటీ సీఎంవో కిరణ్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో జీడీకే–11వ గనిలో ఉద్యోగులకు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. సింగరేణి హెల్త్ ఆఫీసర్ సుమన్ క్యాన్సర్లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రవీందర్, పీవో సంపత్, ఉద్యోగులు పాల్గొన్నారు

**కల్యాణ్‌నగర్‌లో..**

కోల్‌సిటీ, ఫిబ్రవరి 3: లయన్స్ క్లబ్ ఆఫ్ మగువ ఆధ్వర్యంలో గోదావరిఖని కల్యాణ్ నగర్‌లో శనివారం అవగాహన సదస్సుతో పాటు ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. మగువ అధ్యక్షురాలు, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ లక్ష్మీవాణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాలకుర్తి జడ్పీటీసీ కందుల సంధ్యారాణి, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ సతీమణి మనాలీ ఠాకూర్ హాజరయ్యారు. డాక్టర్ లక్ష్మీవాణి క్యాన్సర్ వ్యాధి కారకాలను వివరించారు. అనంతరం లయన్స్ క్లబ్ ప్రతినిధులను సన్మానించారు. కార్యక్రమంలో గాలి సునీత, లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు తానిపర్తి విజయలక్ష్మి, ప్రతినిధులు బాలసాని పద్మ, కళావతి, మనీషా అగర్వాల్, కవిత, శ్రీలత, చింతిరెడ్డి సంతోషా రెడ్డి, బీనా సింగ్, సుష్మారెడ్డి, సద్గుణ, స్వరూప, సునీత, అనిత, భవాని, రేణుక, గంగాధర్, తిలక్ చక్రవర్తి, ముకుందరెడ్డి తదితరులున్నారు.

## అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఫర్టిలైజర్‌సిటీ, ఫిబ్రవరి 3: అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని గోదావరిఖని జిల్లా అదనపు న్యాయమూర్తి శ్రీనివాసరావు అన్నారు. పరుశరాంనగర్‌లోని మార్గదర్శి విద్యావిహార్‌లో శనివారం మండల న్యాయసేవాధికార సంస్థ నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయనమాట్లారు. బాలికలు బ్యాడ్ టచ్, గుడ్ టచ్ గురించి తెలుసుకోవాలన్నారు. ఇక్కడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడ చక్రపాణి, న్యాయవాదులు గుడికందుల భూమయ్య, ప్రవీణ్‌కుమార్, కాదాసి శేఖర్, మాట్ల భానుకృష్ణ, వరలక్ష్మి, లీగల్ సోషల్ వాలంటరీ ఎం శంకర్, పాఠశాల హెచ్‌ఎం ఐ రవి, లీగల్ వలంటీర్ సుజాత ఉన్నారు.

## నాణ్యమైన విద్యుత్ అందించాలి

సుల్తానాబాద్, ఫిబ్రవరి 3 : ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా ఉద్యోగులు పనిచేయాలని పెద్దపల్లి ఎస్ఈ సుదర్శనం సూచించారు. సుల్తానాబాద్‌లో జిల్లా విద్యుత్ యంత్రాంగం పోల్ టు పోల్ పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. సరఫరాలో ఎలాంటి లోపాలు లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతి ఇంట్లోని మీటర్‌ను క్షుణ్ణంగా పరిశీలించి విద్యుత్ చౌర్యం జరుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచిత కరెంట్‌పై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఈఈ పెద్దపల్లి తిరుపతి, డీఈఈ మంథని ఈశ్వరప్రసాద్, సుల్తానాబాద్ ఏడీఈ వెంకటేశ్వర్లు, ఏఈ రంగు శంకరయ్య, ఎస్ఏవోలు, ఏడీఈలు, ఏఈలు, ఎస్ఈలు, జేఏవోలు, లైన్‌ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్‌లు పాల్గొన్నారు.

## మైన్స్ వర్కర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడిగా సీతారామయ్య

గోదావరిఖని, ఫిబ్రవరి 3: దేశ వ్యాప్తంగా బొగ్గు గని కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ఏఐటీయూసీకి దక్కిందని అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. ఈనెల 1న ఝార్ఖండ్‌లో జరిగిన ఇండియన్ మైన్స్ వర్కర్స్ ఫెడరేషన్ కౌన్సిల్ సమావేశంలో సీతారామయ్యను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ముందుగా రాంచీ నుంచి రామగుండం రైల్వే స్టేషన్‌లో దిగిన సీతారామయ్యకు ఏఐటీయూసీ నాయకులు పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు.

## సమ్మక్క జాతరకు ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

సుల్తానాబాద్‌రూరల్,ఫిబ్రవరి 3: మండలంలోని నీరుకుళ్ల మానేటి రంగనాయక స్వామి ఆలయ ఆవరణలో సమ్మక్క–సారలమ్మ జాతర ఏర్పాట్లను ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ముమ్మరం చేశారు. ఈ పనులను కమిటీ చైర్మన్ చేర్లపల్లి నర్సయ్యగౌడ్ పరిశీలించారు. అనంతరం మంచినీటి బావిని ప్రారంభించారు. ఇక్కడ నాయకులు దామోదర్‌రావు, సత్యనారా యణ రెడ్డి,రాజు, వీరస్వామి,శంకర్, రవీం దర్ ఉన్నారు.

## కుష్ఠు వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించాలి

ఓదెల, ఫిబ్రవరి 3: కుష్ఠు వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే వైకల్యాన్ని నివారించవచ్చని డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ దేవిసింగ్ తెలిపారు. కుష్ఠు వ్యాధి నివారణ పక్షోత్సవాలలో భాగంగా కొలనూర్ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. శరీరంపై మొద్దుబారిన మచ్చలు ఉండి స్పర్శ లేకపోతే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఇందిరా కుమారి, హెచ్‌ఈవో సుధాకర్, హెచ్‌ఎం యేసుదాసు, ఏఎన్‌ఎం శ్రీలక్ష్మి, నిర్మల, ఆశ కార్యకర్తలు పర్స మణీంద్రా, సరిత, ప్రేమల, తిరుపతమ్మ పాల్గొన్నారు.

## ఆత్మవిశ్వాసం కోల్పోవద్దు

జూలపల్లి, ఫిబ్రవరి 3 : విద్యార్థులు పరీక్షలంటే భయపడి ఆత్మవిశ్వాసం కోల్పోవద్దని వ్యక్తిత్వ వికాస నిపుణులు కృష్ణమూర్తి, నరేశ్, మంజుల సూచించారు. జూలపల్లి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షల ప్రిపరేషన్‌పై అవగాహన కల్పించారు. ఇక్కడ ఎంపీడీవో వేణుగోపాల్‌రావు, ఎంపీవో కిరణ్, సీఆర్పీలు సతీశ్, తిరుమల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందజేస్తున్న విద్యాశాఖ అధికారులు

## శాస్త్రీయ దృక్పథంతోనే దేశాభివృద్ధి

పెద్దపల్లి కమాన్/మంథని రూరల్, ఫిబ్రవరి 3 : శాస్త్రీయ దృక్పథంతోనే దేశాభివృద్ధి సాధ్యమని జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు కార్యదర్శి వీ హన్మంతు అన్నారు. పెద్దపల్లి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక (తెలంగాణ) రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో శనివారం 'చెకుముఖి టాలెంట్ టెస్టు నిర్వహించారు. జిల్లాలోని 14 మండలాల నుంచి 24 టీమ్‌లు పాల్గొన్నాయి. సుల్తాన్‌పూర్ ఉన్నత పాఠశాల, పెద్దపల్లి బాలికల ఉన్నత పాఠశాల, యూనివర్సల్ స్కూల్ (కన్నాల)టీమ్‌లు ప్రతిభ చూపాయి. ఈ మూడు జట్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనున్నాయి. మంథని మండలం ఆరెంద జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు అశ్విని, అభిషేక్, వైష్ణవి ద్వితీయ బహుమతులు సాధించారు. కార్యక్రమంలో జిల్లా మానిటరింగ్ అధికారి పీఎం షేక్, ఎంఈవో సురేంద్రకుమార్, జేవీవీ రాష్ట్ర కార్యదర్శి ఆలవాల నాగేశ్వర్‌రావు, చెకుముఖి సంబురాలు జిల్లా కన్వీనర్ నలమాసు హరిప్రసాద్, హెచ్‌ఎం టీ అరుణ, జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం కోశాధికారి పురుషోత్తం, జిల్లా సైన్స్ అధికారి వీ రవినందన్‌రావు, బాలల సైన్స్ కో ఆర్డినేటర్ కే శ్రీనివాస్, గద్దె శ్రీనివాస్, కొమురయ్య, బీ ప్రసాద్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**సత్తా చాటిన విద్యార్థులు..**

తెలంగాణ సోషల్ ఫోరమ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో శనివారం సాంఘిక శాస్త్ర ప్రతిభా పాటవ పరీక్షలు నిర్వహించారు. విజేతలకు గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ విజ్ఞాన ప్రతిష్టాన్ చైర్మన్ గున్న రాజేందర్‌రెడ్డి, తెలంగాణ సోషల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు రతంగాపాణి రెడ్డి, ఇన్‌చార్జి డీఈవో హన్మంతు, పెద్దపల్లి జిల్లా క్వాలిటీ కో–ఆర్డినేటర్ షేక్ సర్టిఫికెట్లు అందజేశారు.

**విద్యార్థులకు వైద్య పరీక్షలు**

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 3: హన్మంతునిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కరీంనగర్‌కు చెందిన దీప్తి స్కిన్ దవాఖాన ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ సీహెచ్ దీప్తి ప్రసాద్, డాక్టర్ రాజశేఖర్, అయన్స్‌క్లబ్ ఆర్‌సీ అశోక్‌కుమార్, జడ్సీ సంపత్‌రావు, అధ్యక్షుడు లైశెట్టి భిక్షపతి, అతీఫ్,కంకటి శ్రీనివాస్,మేడగోని శ్రీనివాస్, హెచ్‌ఎంలు దశరథం, చంద్రకళ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**దరఖాస్తుల ఆహ్వానం**

మంథని, ఫిబ్రవరి 3:గౌతమేశ్వరస్వామి ఆలయ కమిటీ ఏర్పాటుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎండోమెంట్ డిప్యూటీ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు మంథని ఈవో రాజ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గౌతమేశ్వరాలయానికి ఐదుగురు సభ్యులతో కూడిన ట్రస్టు బోర్డు ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

**రేపు వేలం**

ఓదెల, ఫిబ్రవరి 3: కొలనూర్‌లో ఈ నెల 21 నుంచి ప్రారంభం కానున్న సమ్మక్క– సారలమ్మ జాతరలో వివిధ రకాల దుకాణాల నిర్వహణకు సోమవారం వేలం నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ దేవిడి శ్యాంరెడ్డి తెలిపారు. కొలనూర్‌లోని వేణుగోపాలస్వామి ఆలయ అవరణలో ఉదయం 11గంటలకు వేలం ఉంటుందని తెలిపారు. కొబ్బరికాయలు, బెల్లం, పేలాలు, పుట్నాల విక్రయాల దుకాణాలకు వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-319429-All

CHANGE OF NAME

★ I, NAREDDY SUVARNA, D/o. Ram Reddy, R/o. 2-10-1090, Jyothi Nagar, Karimnagar, TS. Changed My Name as MUDUGANTI SUVARNA REDDY, W/o. Manohar Reddy.
NT-319691

★ I, ENUKONDA SRINIVASA REDDY, S/o. Venkata Reddy, R/o. 1-4/1, Mallapur, Thimmapur, Karimnagar, TS. Changed My Name as ENUKONDA SRINIVAS REDDY, S/o. Venkata Reddy.
NT-319691

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194